క్లుప్తంగా

రేపు మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్షలు

నల్లగొండ : రామానుజన్ జయంతి సందర్భంగా జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ఈనెల 12న విద్యాశాఖ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు గణిత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలంగాణ గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు అద్దంకి సునీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కొరివి కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్, మోడల్‌స్కూల్స్, కేజీబీవీ విద్యార్థులు ప్రతి పాఠశాల నుంచి తెలుగు మీడియం నుంచి ముగ్గురు, ఇంగ్లిష్ మీడియం నుంచి ముగ్గురు పరీక్షలో పాల్గొనాలని కోరారు. ప్రతి మండలం నుంచి ముగ్గురు విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వారు తెలిపారు.

17న సర్వసభ్య సమావేశం

నకిరేకల్ : పట్టణంలోని గౌడ కల్యాణ మండపంలో ఈనెల 17న కల్లు గీత పారిశ్రామిక సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో సంఘం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సభ్యత్వం ఉన్న ప్రతి గీత కార్మికుడు పాస్‌ఫొటోతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

బహుమతులు అందజేత



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

నార్కట్‌పల్లి: నల్లగొండ పట్టణంలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించిన భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం దేవస్థానం ఇన్‌చార్జ్ సేవాలాల్‌నాయక్, స్ఫూర్తి విద్యాలయం ప్రిన్సిపాల్ వంగాల శ్రీనివాస్‌రెడ్డి బహుమతులు అందజేశారు. సీనియర్ విభాగంలో కుక్కల శార్వాణి ప్రథమ స్థానం, చెరుకు వైష్ణవికి ద్వితీయ స్థానం లభించింది. జూనియర్ విభాగంలో ప్రథమ స్థానం బసిరెడ్డి లక్ష్మీశృతిక, బుర్రి వైభవ్‌కు ద్వితీయ స్థానం లభించింది. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

మాజీ సీఎంను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

నార్కట్‌పల్లి : ఎర్రవెల్లిలో మాజీ సీఎం కేసీఆర్‌ను నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి–శోభ దంపతులతో పాటు నార్కట్‌పల్లి మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కేసీఆర్‌కు శ్రీపార్వతి జడల రామలింగేశ్వరస్వామి చిత్రపటం అందజేశారు. కలిసిన వారిలో చెర్వుగట్టు మాజీ సర్పంచ్ మల్ల బాలకృష్ణ, నార్కట్‌పల్లి మాజీ ఎంపీటీసీ పుల్లెంల ముత్తయ్య ఉన్నారు.

14న మెగా లోక్‌అదాలత్



నల్లగొండ క్రైం : రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కక్షిదారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

నల్లగొండ క్రైం : కక్షిదారులు కేసులను రాజీ చేసుకునేందుకు ఈనెల 14న మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం పట్టణంలోని నల్లగొండ రూరల్, టూటౌన్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లలో కక్షిదారులతో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి, ఎస్‌ఐలు సైదాబాబు, నాగరాజు, వన్‌టౌన్‌లో సీఐ రాజశేఖర్ రెడ్డి మాట్లాడారు. కోర్టు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి

కనగల్ : ఈనెల 14న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ పి.విష్ణుమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసులను పరిష్కరించుకోవాలనుకునే వారు 8712670184, 9963383385ను సంప్రదించాలని కోరారు.

నేస్తం సొసైటీ ఆధ్వర్యంలో మినీ క్రిస్మస్ వేడుకలు

నల్లగొండ : పట్టణంలోని నేస్తం సొసైటీ కార్యాలయంలో నేస్తం సొసైటీ, జీవితాశ కౌన్సిలింగ్ సెంటర్ల ఆధ్వర్యంలో మంగళవారం మినీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. నేస్తం సొసైటీ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.వెంకటేశ్వర్లునాయక్, నేస్తం వ్యవస్థాపకుడు కట్టా వెంకన్న, ఏఆర్‌టీ హర్ష్‌బేగం, సంపతయ్య, సయ్యద్ సజ్జద్‌అలీ, ఎం.చామంతి, సైదులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్

ఊపందుకున్న యాసంగి సాగు

- చెరువులు, కుంటలు నిండడంతో పెరిగిన భూగర్భజలాలు
- పొలం పనుల్లో బిజీగా అన్నదాతలు
- గతం కంటే పెరగనున్న వరిసాగు



రాయినిగూడెంలో వరినాట్లు వేస్తున్న కూలీలు



తిప్పర్తిలో పొలం దున్నుతున్న రైతు

తిప్పర్తి : చెరువులు, కుంటల్లో నీరు చేరడంతో ప్రస్తుత యాసంగిలో సాగు పనులు ఊపందుకున్నాయి. గత వానాకాలంలో చెరువులు, కుంటల్లో నీరు లేక భూగర్భజలాలు అడుగంటి అన్నదాతలకు వరిసాగు భారంగా మారింది. కాని ఈ సీజన్‌లో వర్షాలు విరివిగా కురవడంతో మండలంలోని అన్ని చెరువులు, కంటల్లోకి నీరు చేరింది. దీంతో భూగర్భ జలాలు పెరిగి బోర్లు బాగా పోస్తున్నాయి.

పెరగనున్న సాగు విస్తీర్ణం..

గత వానాకాలంలో మండల వ్యాప్తంగా 26వేల ఎకరాలలో మాత్రమే వరిసాగు చేశారు. ప్రస్తుతం భూగర్భజలాలు పెరగడంతో ఈ సీజన్‌లో సుమారు 32వేల ఎకరాలలో రైతులు వరిసాగు చేయనున్నారు. సుమారు ఆరు వేల ఎకరాలలో వరిసాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

ప్రారంభమైన పనులు..

మండల వ్యాప్తంగా అన్నదాతలు వరిసాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాలలో వ్యవసాయ పనులు ప్రారంభించారు. కొన్ని ప్రాంతాలలో నాట్లు కూడా వేశారు. మరికొన్ని గ్రామాల్లో నారుమడ్లు, దుక్కులు దున్నుకుంటూ రైతులందరు వ్యవసాయ పనుల్లో బీజీగా మారారు. వర్షాలు కురవడంతో భూగర్భజలాలు పెరగడంతో రైతులు ఎక్కువగా వరిసాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

వంద ఎకరాలలో వేరుశనగ సాగు..

మండలంలోని రైతులు వరిసాగుతో పాటు యాసంగిలో వేరుశనగ సాగు వైపు కూడా మొగ్గు చూపుతున్నారు. ఈ యాసంగిలో వేరుశనగ సుమారు 100ఎకరాలలో వేయనున్నట్లు వ్యవసాయ అధికారుల అంచనా వేస్తున్నారు.

వరిసాగు పెరగనుంది



వానాకాలం కంటే ప్రస్తుత యాసంగిలో వరిసాగు పెరగనుంది. గత వానాకాలంలో వర్షాలు లేకపోవడంతో వరిసాగును తగ్గించారు. కాని ప్రస్తుతం భూగర్భజలా లు పెరగడంతో మండల రైతులు వరిసాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. అదే విధంగా వేరుశనగ సాగు కూడా సుమారు వంద ఎకరాలలో సాగు చేయనున్నారు. ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాం.

– సన్నిరాజు, మండల వ్యవసాయ అధికారి

ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వేముల వీరేశం



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : తెలంగాణ ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో కట్టంగూర్ మండలంలోని 84మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.26.26లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. గడిచిన ఏడాది కాలంలో రూ.4.13కోట్ల సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 30వేల మంది రైతులకు రుణమాఫీ చేశామన్నారు. నియోజకవర్గానికి 3500ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దేశంలోనే తెలంగాణ అభివృద్ధిలో అగ్రగామిగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కట్టంగూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జెడ్పీటీసీలు మాద యాదగిరి, సుంకరబోయిన నర్సింహాయాదవ్, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

చండూరు : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్నధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు సందర్శించారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ తోకల వెంకన్న మాట్లాడారు. సన్నవడ్లకు రూ.500బోనస్ పేరుతో మాయమాటలు చెప్పి రైతులకు ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేయకుండా కల్లాల వద్దనే ఉంచడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల ఉసురుపోసుకోవద్దన్నారు. తక్షణమే కొనుగోలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న, మున్సిపల్ కౌన్సిలర్ అన్నెపర్తి శేఖర్, మాజీ మండల అధ్యక్షుడు పెద్దగోని వెంకన్న, మండల అధికార ప్రతినిధి బొడ్డు సతీష్, నాయకులు గోపిడి వెంకటరెడ్డి, పిట్టా వెంకటరమణారెడ్డి, కావలి ప్రసాద్, చిరువెళ్లి నరేష్, స్వామి, హరినాధరావు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల అరెస్ట్ అప్రజాస్వామికం



నకిరేకల్ : నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఆశావర్కర్లు, నాయకులు

చిట్యాల : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌కు వెళ్తున్న ఆశావర్కర్లను అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీసులు ఆశావర్కర్లను అరెస్ట్ చేయగా పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వారిని కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆశావర్కర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, రాష్ట్ర బీజేపీ నాయకుడు చికిలంమెట్ల అశోక్ ఉన్నారు.

ఆశావర్కర్ల ముందస్తు అరెస్ట్

మునుగోడు : తమకు కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్లేందుకు సిద్ధమైన ఆశావర్కర్లను మండల పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు.

కట్టంగూర్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్‌లు హైదరాబాద్‌లో ధర్నాకు వెళ్తుండగా మంగళవారం స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్‌లు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు వెంటనే అమలు చేయాలని కోరారు. అరెస్ట్ అయిన వారిలో చెవుగోని ధనలక్ష్మి, అబ్బగోని సంతోష, పద్మావతి, పాడిచేటి సునీత, చిట్యాల సుజాత, ధనమ్మ ఉన్నారు.

ఆశావర్కర్ల నిరసన ప్రదర్శన

నకిరేకల్ : హైదరాబాద్‌లో ఆశావర్కర్లపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం పట్టణంలో ఆశావర్కర్ల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు సింగం రేణుక మాట్లాడుతూ.. ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కనీసం వేతనం రూ.18వేలు ఇవ్వాలని కోరారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్, సంఘం ప్రతినిధులు పద్మ, సుల్తానా, చెవుగోని ఇందిర, ఏశబోయిన హైమావతి, బండారు జ్యోతి, కొండ పద్మ, అనసూర్య, సత్యవతి, సబిత, విజయలక్ష్మి, సుజాత, వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు న్యాయం చేయాలి

కనగల్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా ధర్నాకు వెళ్తున్న ఆశావర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని సీఐటీయూ మండల కన్వీనర్ కానుగు లింగస్వామి అన్నారు. మంగళవారం ఆశావర్కర్లను ఇళ్లకు వచ్చి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం అన్యాయమన్నారు. అరెస్ట్ అయిన వారిలో ఆశాలు నిర్మల, అలివేలు, సునంద, లక్ష్మి, శ్రీదేవి, రాధ, అంజమ్మ, కల్పన తదితరులు ఉన్నారు.

అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదు

తిప్పర్తి : ఆశవర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని సీఐటీయూ నాయకులు బీమగాని గణేష్, మంత్రాల మంగమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశవర్కర్లకు కనీస వేతనం ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదని, అందుకు నిరసనగా శాంతియుతంగా ధర్నాకు వెళ్తున్న ఆశ వర్కర్లను అర్ధరాత్రి అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం దారుణమన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే మునుగోడు అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



మునుగోడులో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి



మర్రిగూడలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మునుగోడు : అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మునుగోడు నియోజకవర్గం బీఆర్‌ఎస్ పాలనలోనే అభివృద్ధి చెందిందని, ఇప్పటికీ ఆ ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల పనులనే స్థానిక ఎమ్మెల్యే ప్రారంభిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం పట్టణంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మునుగోడు నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల తప్పా మరో నూతన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని తన పార్టీ కోసం వినియోగించుకుంటున్నారని, సచివాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహంకాంగ్రెస్ విగ్రహంగా ఏర్పాటు చేసుకున్నాడని ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నించిన బీఆర్‌ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత మొదలైందన్నారు. ఇప్పటికీ ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మందుల సత్యం, మారగోని అంజయ్యగౌడ్, గజ్జల బారాజు గౌడ్, పోలగోని సైదులు, ఈద శరత్‌బాబు, యడవల్లి సురేష్, బోయ లింగస్వామి, ఐతగోని విజయ్ గౌడ్, సాంబయ్య, శంకర్, పర్వతం పాల్గొన్నారు.

తెలంగాణ తల్లిని అవమానించిన కాంగ్రెస్

మర్రిగూడ : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చి అవమానించిదని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారితే తెలంగాణ తల్లి మారుతుందా అని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి రూపం ఎప్పటికి మారదని, ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్, పందుల యాదయ్య, బచ్చు రామకృష్ణ, నగేష్, వెంకటరమణరెడ్డి, గోపి, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

గట్టుప్పల్‌లో..

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ అవ్వారి గీతాశ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ గోరిగే సతయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు బండారు చంద్రయ్య, మాజీ సర్పంచ్ కర్నాటి అశోక్, అంజయ్య, పున్న కిషోర్, కర్నాటి అబ్బయ్య, యాదయ్య, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం



గట్టుప్పల్‌లో..

చండూరు: తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ మార్పుకు నిరసనగా మండల కేంద్రంలో కాంగ్రెస్ తల్లి వద్దు తెలంగాణ తల్లి ముద్దు అనే నినాదంతో బీఆర్‌ఎస్ నాయకులు స్థానిక చౌరస్తాలోని పాత తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న, కౌన్సిలర్ అన్నెపర్తి శేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న, ఉపాధ్యక్షుడు కురపాటి సుదర్శన్, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు సతీష్, మాజీ మండల అధ్యక్షుడు పెద్దగోని వెంకన్న, జిల్లా నాయకులు శిరంశెట్టి శ్రీధర్ బాబు, తెలుకుంట్ల జానయ్య, చంద్రశేఖర్, నగేష్, రామన్న, గీత పాల్గొన్నారు.



చండూరులో పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు

కట్టంగూర్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకొని పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 19నుంచి డిసెంబర్ 10వరకు జిల్లా స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో ×హమారా సౌచాలయ్ – హమారా సమ్మాన్‌÷నినాదంతో కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా చేసుకున్న లబ్ధిదారులను గుర్తించి సన్మానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్లు జి.శంకర్‌బాబు, ఎండీ మొయినుద్దీన్, ఎంపీఓ చింతమల్ల చలపతి, పీఆర్‌ఏఈ జమీల్‌అహ్మద్, ఏపీఓ రాంమోహన్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

తపస్ ధర్మాగ్రహ దీక్ష పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ : హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఈనెల 17న నిర్వహించనున్న తపస్ ధర్మాగ్రహ దీక్ష పోస్టర్‌ను మంగళవారం పట్టణంలోని తపస్ కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అలుగుపల్లి పాపిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. పెండింగ్ బిల్లులు, డీఏలు, పీఆర్సీ అమలు చేయాలని కోరుతూ ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ధర్మాగ్రహ దీక్షకు సంఘం ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని భాస్కర్‌గౌడ్, రేణికుంట్ల రాజశేఖర్, చక్రధర్, వెంకట్‌రెడ్డి, పిండి వెంకట్‌రెడ్డి, ప్రసాద్, కిషన్, ప్రసాద్, శ్రీనివాస్, వెంకటేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ఆలయ భూముల సర్వే



భూములను సర్వే చేస్తున్న అధికారులు

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి గ్రామపరిధిలో శ్రీతిరుమలనాథస్వామి ఆలయ భూములతో పాటు ప్రభుత్వ భూములు అక్రమణకు గురవుతున్నాయని ఆ గ్రామస్తులు గతంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు మంగళవారం ఆలయ, ప్రభుత్వ భూములను సర్వే చేశారు. ప్రభుత్వ భూములు, తిరుమలనాథస్వామి ఆలయానికి చెందిన 199,200 సర్వే నంబర్‌లోని భూములను మండల సర్వేయర్ రజనీకాంత్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ డివిజనల్ అధికారి సుమతి సమక్షంలో డిజిటల్ సర్వేను చేశారు. తుది నివేదికను త్వరలో రెవెన్యూ అధికారులకు అందజేసి హద్దులను నిర్ణయిస్తామని సర్వేయర్ వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ పొట్లపల్లి చిన్నస్వామి, ఎమ్మార్పీఎస్ నాయకుడు చేకూరి గణేష్, బీజేపీ మండల అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహ, గ్రామస్తులు మాచర్ల యాదగిరి, ఏర్పుల దామోదర్, ఏర్పుల రాజేష్, మోర రాములు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

నల్లగొండ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు జిల్లాలో దాదాపు 1100మంది వివిధ విభాగాల్లో 20సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, వారికి సరైన వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు పరిష్కరించలేదన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అదేవిధంగా ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10లక్షలు, ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.25లక్షలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నాయకుడు మోలుగురి కృష్ణ, బొమ్మగాని రాజు, కె.చంద్రశేఖర్, పి.పుష్పలత, జి.మంజుల, సావిత్రమ్మ, కొండయ్య, క్రాంతికుమార్, నీలాంబరి, వెంకటేశ్వర్లు, సావిత్రి, శ్రీరాములు, నాగరాజు, ఎం.లలిత, రమాదేవి, మోయిజ్‌ఖాన్, సుధ, యాదగిరి పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి



సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు, నాయకులు

నల్లగొండ టూటౌన్ : అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న చేపడుతున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.సలీం అన్నారు. మంగళవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నాకు సంబంధించి డీడబ్ల్యూఓ, సీడీపీఓలకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఐసీడీఎస్ ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని, నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని, తదితర డిమాండ్లతో చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, కోట్ల అశోక్‌రెడ్డి, యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, శాంత, పద్మ, నళిని తదితరులు పాల్గొన్నారు.

బెల్టుదుకాణాలు నిర్వహిస్తే చర్యలు తప్పవు

మర్రిగూడ : గ్రామాలలో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ మునగాల కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సరంపేట పరిధిలోని గర్నగడ్డకు చెందిన మోటం రాములమ్మ ఇంట్లో నిల్వ ఉన్న 5.5లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. బెల్ట్ దుకాణాల నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, దానిని దృష్టిలో ఉంచుకోని గ్రామాల్లో మద్యం విక్రయాలు చేయరాదని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది సైదులు, వాహీద్, యాదగిరి ఉన్నారు.

పథకాలను ప్రజలకు వివరించాలి

కట్టంగూర్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ శక్తికేంద్రం సంస్థాగత ఎన్నికల అధికారి పాలోజు జలేంద్రాచారి అన్నారు. మంగళవారం మండలంలోని ముత్యాలమ్మగూడెం, మల్లారం గ్రామాలలో నిర్వహించిన పార్టీ బూత్ కమిటీ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం 195, 196 బూత్ అధ్యక్షులుగా గంజి అంజనేయులు, కాడింగ్ కుమార్, 206 బూత్ అధ్యక్షులుగా పెద్ది గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పబ్బు వెంకటేశ్వర్లు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ కోమటి భాస్కర్, నాయకులు గున్నాల నాగరాజు, నీలం నాగరాజు, బత్తిని నాగరాజు, రాజు, నాగచైతన్య పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న జలేంద్రచారి

స్వచ్ఛందంగా కంపచెట్ల తొలగింపు



నెల్లిబండ వెళ్లే రోడ్డు వెంట జేసీబీతో కంపచెట్లు తొలగింపు చేయిస్తున్న గ్రామస్తులు

నకిరేకల్ : మండలంలోని నెల్లిబండ గ్రామానికి చెందిన ప్రజలు స్వచ్ఛందంగా రూ.50వేల విరాళాలు సేకరించి తమ గ్రామానికి వచ్చే రహదారికి ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న కంపచెట్లను తొలగింపజేశారు. సిరొంచ హైవే నుంచి నెల్లిబండ గ్రామం వరకు సూమారు మూడు కిలోమీటర్ల రోడ్డు ఉంది. ఈ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరగడంతో పాటు మూలమలుపులు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత నెల 23న గ్రామానికి చెందిన యానాల ప్రభాకర్‌రెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్తూ దారిలోని ఓ మూల మలుపు వద్ద ట్రాక్టర్ ఢీకొని మృతి చెందాడు. అతడితో పాటు ఇటీవల గ్రామానికి వస్తున్న పాఠశాల బస్సు కూడా ఓ ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టడంతో గాయాలపాలయ్యారు. దీంతో గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను జేసీబీతో తొలంగింపజేశారు.

వ్యక్తి అదృశ్యంపై ఎస్పీకి వినతి



సుదర్శన్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : ఆరేళ్ల కింట అదృశ్యమై నేటికి ఆ వ్యక్తి ఆచూకీ దొరకడం లేదని, అతడి ఆచూకీ తెలుసుకోవాలని కోరుతూ మిర్యాలగూడ పట్టణం సంతోష్‌నగర్‌కు చెందిన పొట్టుముత్తు పద్మ సోమవారం ఎస్పీ శరత్‌చంద్రా పవర్‌కు ఫిర్యాదు చేసింది. తన భర్త పొట్టుముత్తు సుదర్శన్ 2018 జులై 13 నుంచి కనిపించకుండా పోయాడని, అప్పట్లో మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వెతికామని ఎక్కడా ఆచూకీ లభించలేదని, ఇప్పటికైనా తప్పిపోయిన తన భర్త సుదర్శన్‌ను వెతికి తనకు న్యాయం చేయాలని కోరారు.